మార్చుకోండని దేవుడు కోరుతున్నాడు. దేవుని దయయందును, మనుష్యుల దయయందును, దేవుని న్యాయంతో పాటు లోక న్యాయాన్ని కూడా నెరవేరుస్తూ దినదినము ఆయన కృపలో వర్థిల్లుతూ నీతి – న్యాయంతో బ్రతకమని మన బ్రతుకు పుస్తకమైన బైబిల్ బోధించుచున్నదని గ్రహించిన వారు ధన్యులు.

నేడు దేవుని యెడల భయము పెరిగినట్లుండి భక్తి తగ్గిపోతుంది. భయం తగ్గి భక్తి, ఆరాధన భావం పెరిగితేనే ఆయనను తండ్రిగా ఒప్పుకున్నట్లు. కాబట్టి భయభక్తులను సమంగానైనా ఉంచండి, భయం నటించకండి, భయభక్తులతో జీవించండి. యధార్థంగా జీవించండి దేవున్ని ఆత్మతో సత్యముతో ఆరాధించండి. దేవుని రాజ్యానికి వారసులు, వారధులు కావాలనుకొనే వారు చాలా జాగ్రత్తగా ఆలోచించి నిర్ణయం తీసుకోగలరు. ఆయన యందు భయ–భక్తులతో బ్రతుకాలనుకొనే వారందరికి ఆయన ప్రేమ, ఆయన ప్రియకుమారుడైన క్రీస్తు కృప, ఆయన పరిశుద్ధాత్మ సహాయాలు సదాకాలము తోడైయుండును గాక... ఆమేన్.

ఇంకా మరిన్ని వివరాలకోసం దేవుని వాక్యానుసారమైన బోధ, జ్ఞానం కోసం, బైబిల్‌పై మీకున్న అనుమానాలకు, ప్రశ్నలకు సరియైన సమాధానం కోసం మరియు ఉచిత బైబిల్ తర్ఫీదు కోసం, ఉచిత కరపత్రాల కోసం ఇంకా పుస్తకాలు, ప్రసంగాల ఆడియో, వీడియో డివిడిల కోసం ఈ క్రింది చిరునామాలలో, ఫోన్ ద్వారానైనా సంప్రదించండి...

**ప్రపంచ క్రైస్తవులారా! వాక్యం కోసం ఏకంకండి! (యోహాను 17:21)**

"కులం కుళ్ళు, మతం మత్తు, ధనం దగా, మనిషి మాయ – దేవుడే దిక్కు"

---


ప్రభువైన క్రీస్తు సేవలో మీ...

**డా|| బొంకూరి జాన్,**

**ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బైబిల్ టెక్నాలజి** హైదరాబాద్,

**దేవాలయాలు దేవున్ని ప్రార్థించే స్థలం**, HAL, రాఘవేంద్రకాలని

IOC పెట్రోల్‌బంక్ వెనుక, సుచిత్ర జంక్షన్ దగ్గర, కుత్బుల్లాపూర్, హైదరాబాద్ – 67,

ఫోన్ : 040–20000700, సెల్ : +91 9440142887,

web: www.bibletechnology.net, www.instituteofbibletechnology.com

E-mail : bibletechnology@gmail.com

**Bro. J. Ravi,** Cell : 9676744233, 9440792192, 9959372221


Note : For free distribution in churchs only

# భయము!? భక్తి!?



**సమాజం** శాస్త్రీయంగా అభివృద్ధి చెందుతున్న ఈ రోజుల్లో మనుషులకు సృష్టి కర్తయైన దేవుడంటే భయ భక్తులు ఏ మాత్రం లేవు, జనులందరు బొత్తిగా చెడి పోయారు. నీతికి–న్యాయానికి అస్సలు స్థానమే లేదు. దుర్మార్గాన్ని ఎదిరించి బ్రతుక లేము, ఎలాగైనా సర్దుకుపోవాలి బ్రదర్ అని ప్రతి ఒక్కరూ అంటున్నారు. అయితే నేడు ప్రపంచ మంతటా దైవ భక్తుల సంఖ్య మాత్రం చాలా వేగంగా పెరుగుతు న్నట్లు కనిపిస్తుంది. దేవుడికి జీవుడికి మధ్య అనుబంధాన్ని పెంచుతున్నా మని చెప్పుకొనే చర్చిల సంఖ్య, క్రైస్తవేతరుల గుడులు, ప్రార్థనా మందిరాల సంఖ్య రోజు రోజుకూ విపరీతంగా పెరిగి పోతుంది. అయితే అంతే వేగంగా ఈ సమాజంలో దోపిడీలు, దొంగ తనాలు, హత్యలు, ఆత్మ హత్యలు, మానభంగాలు ఇంకా అనేకమైన నేరాలు – ఘోరాల సంఖ్య కూడా పెరిగి పోతూనే ఉంది. పోలీస్ స్టేషన్లలో, కోర్టులలో కేసుల సంఖ్య పెరిగి న్యాయం – శిక్షలు కూడా చాలా ఆలస్యం అవుతున్నాయి.

ఉదయం లేవగానే టి.వి. మరియు న్యూస్ పేపర్లలో ఇవే వార్తలు విని, చదువాల్సి వస్తుంది. ఈ రోజు మనిషి ఇంట్లోంచి బయటకు వెళితే మళ్ళీ క్షేమంగా తిరిగి ఇంటికెళు

తాడనే గ్యారంటీ ఏ మాత్రం లేకుండా పోయింది. అర్ధరాత్రి వేళ ఆడది ఒంటరిగా తిరుగడమేమో గాని మగాడు పట్టపగలే నడిరోడ్డు మీద నడవలేని దుస్థితి దాపురించింది. ఇవన్నీ చూస్తుంటే దేవుడంటే మనలో (ఆస్తికులలో) ఉన్న భక్తి నిజంగా భక్తేనా? అని అనుమానించి, అన్ని కోణాల్లో ఆలోచించి, పరిశీలించి పరీక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది **(2కొరింథీ 13:5)**. వారానికొకసారి లేదా తనకు వీలైనప్పుడు చర్చికో, గుడికో, మసీదుకో వెళ్ళి మోకరించి ప్రార్థనో, నమాజ్ అనో, కళ్ళు మూసుకొని దండం పెట్టుకోవడమే దేవున్ని పూజించడం, అదే అసలైన భక్తి అని చాలా మంది అనుకుంటున్నారు. అలా చేయకపోతే దేవుడు శిక్షిస్తాడని అనుకోవడమే భయము ఉన్నట్లు అంటున్నారు అందరూ. తీర్థయాత్రలు, పుణ్యక్షేత్రాలు దర్శించడం, మొక్కుబడులు దశమభాగాలు, కానుకలు చెల్లించడమే అసలు, సిసలైన భయ–భక్తులు అనుకొని మన పిల్లలకు కూడా వాటినే నేర్పిస్తున్నాము. ఇదెంత వరకు సత్యమో మనుషులందరి బ్రతుకు పుస్తకం, సత్యవేదమైన బైబిల్‌ను బట్టి ఆలోచించి, గ్రహించుదాము.

నవీన యుగంలో అన్ని వసతులతో ఆనందంగా జీవిస్తున్నానని అనుకొంటున్న నవనాగరిక మానవుడిలో మానవత్వం మచ్చుకైనా కనిపించక, అనాగరికుడి కన్నా అధ్వాన్నంగా అనగా దానవత్వంలోనికి శరవేగంతో జారిపోతున్నాడని ప్రతి వారు నెత్తి–నోరు బాదుకొంటూ తెగ బాధపడిపోతున్నారు. దీనికంతటికి కారణం మనుష్యుల్లో భయభక్తులు లోపించడమేనన్నది పచ్చి నిజం, ఎవ్వరూ కాదనలేని నగ్న సత్యం. ఈనాడు మనం పలుకుతున్న ఈ మాటలనే దేవుడు క్రీస్తు పూర్వం సుమారు 1000 సం॥ క్రితమే తన పిల్లలుగా ఎంచుకొన్న ఇశ్రాయేలీయులతో తన కుమారుడైన దావీదు మహారాజుతో పలికించి, వ్రాయించి ఇప్పటికీ భద్రపరచియున్నాడు.

“నీతిమంతుడు లేడు, ఒక్కడును లేడు, గ్రహించు వాడెవడును లేడు, దేవునిని వెతకువాడెవడును లేడు, అందరును త్రోవ తప్పి ఏకముగా పనికి మాలిన వారైరి...” **(కీర్తన 14, 53 అధ్యాయాలు; రోమా 3:11–20)**.

సుమారు 3,500 సం॥ల క్రితమే దేవుడు పలికించిన సత్య వాక్కులను, నేటి మానవుడు ఇప్పటికి తిరిగి వల్లె వేయుచూ, అలా చెబుతున్న అందరిలో తాను కూడా ఉన్నానని మరచిపోతున్నాడేగాని, తాను దేవుడు చెప్పిన రీతిగా నీతిమంతుడనేనా? అని తాను వెళ్ళుతున్న త్రోవను, మార్గాన్ని లేకా తనను మంచి వాడిగా తీర్చి దిద్దుతుందని నమ్మిన మతాన్ని, దాని ఆలోచనా విధానాన్ని సరిదిద్దుకొని కేవలం ఇంటినో, గుడినో, చర్చినో కాక మొత్తం తమ సమాజాన్ని లేకా దేశాన్ని దేవాలయంగా మార్చాలనే తపన కలవారు కాగడా పెట్టి వెతికినా, కనుచూపు మేరలో కనబడుటలేదు. అలా ఆలోచించి ఆ దేవుని మార్గంలో ప్రయాణించేవారిని పిచ్చివారుగా చూస్తూ అవహేళన చేసే దౌర్భాగ్యపు స్థితిలో ఉన్నారు మేమే భక్తులమని చెప్పుకొంటున్నవారు. మరికొందరు భక్తాగ్రేసరులు తమ మూఢ, మూర్ఖ, మత మౌఢ్యంతో సత్యాన్వేషకులను, సత్య మార్గములో నడువాలనుకొనే వారిని క్రూరంగా హింసించి చంపి, భయ భ్రాంతులకు గురి చేస్తూ ప్రమోదంలో పరిహాసం చేస్తున్నారు.

నేటి సమాజం రోజు రోజుకూ స్మశానంగా మారుతుందంటే ప్రతిరోజు దేవాలయాలు, ప్రార్థనా మందిరాల కొచ్చి వేలు, లక్షలు, కోట్లకొద్దీ కానుకలిచ్చి దేవున్ని పూజిస్తూ లేదా ప్రార్థనలు చేస్తున్న వారిలో ఉన్నది భయభక్తులు కానట్లే కదా. దేవున్ని నమ్మినామని చెప్పే ప్రజలే (ఏ మతాలవారైనా, మార్గాలు, విశ్వాసులైన వారైనా) దేవుడి పేరుతోనే మతంమత్తులో జోగుతూ, భక్తిముసుగులోనే సభ్య సమాజంలో మారణహోమాలు సృష్టిస్తున్నారు. సమాజంలో మూఢ నమ్మకాలను, అసాంఘిక కార్యక్రమాలను పెంచి పోషిస్తున్నారు. శరీరాశ, నేత్రాశ, జీవపు డంభాల (అధికార కాంక్ష, భోగలాలసల) కోసం మానవత్వాన్ని మంట గలుపుతున్నారు. ఈ విషయాన్ని చూస్తే దేవుడు లేడనే నాస్తిక, హేతువాదులు అనగా ప్రకృతి సంబంధులే చాలా మేలు అనిపిస్తుంది. శరీర అనగా లోక సంబంధముగా సమాజంలోని అనేకులకు మేలు చేస్తున్నవారు అనగా మంత్రాలు, తంత్రాలు, క్షుద్రశక్తులు, దైవికశక్తులు జ్యోతిష్యాలు లాంటి మూఢనమ్మకాలను నిర్మూలిస్తూ అందరిని విజ్ఞానం పేరుతో ఎదిగిస్తున్నవీరు మాత్రం ఆత్మీయ విషయంలో చాలా వెనుకబడి తమ ఆత్మలతో పాటు అనేక ఆత్మలను నిత్య నాశనానికి నడిపించడమే బాధాకరమైన విషయం.

ఇంతకూ నాటి నుండి నేటి వరకు మనుష్యులలో సర్వేశ్వరుడైన దేవుడంటే భయభయక్తులు లోపించడానికి కారణం ఆ దేవదేవుని గూర్చిన జ్ఞానం అనగా ఆ దేవుని తత్వము లేదా దేవత్వముపై పూర్తిగా అవగాహన లేక పోవడమేనని దేవోక్తులతో కూడిన బైబిల్ చెబుతుంది. క్రీస్తుపూర్వమే ప్రపంచ మానవాళికి దేవుడిచ్చిన తన జ్ఞానం గూర్చి ఆలోచిస్తే, ధ్యానిస్తే “దేవుని (యెహోవా అనేది కేవలం ఇశ్రాయేలీయుల కిచ్చిన నామం) యందలి భయభక్తులే జ్ఞానమనియు, దుష్టత్వము విడుచుటయే వివేకమనియు ఆయన నరులకు సెలవిచ్చెను **(యోబు 28:28)**. అదే యోబుగ్రంథం ప్రారంభంలోనే “ఊజు దేశమందు యోబు అను ఒక మనుష్యుడుండెను. అతడు యథార్థవంతుడును, న్యాయవంతుడునై దేవుని యందు భయభక్తులు కలిగి చెడుతనమును విడిచినవాడు” **(యోబు 1:1–8, 2:8)** అని చెప్పాడు ఆ పరమాత్ముడు. దేవుని జ్ఞానం అంతా

యేసుక్రీస్తులో ఉందని, ఆయన కుమారుడైన యేసే దేవుని జ్ఞానం – శక్తి అని కూడా చెప్పి నూతన నిబంధనలో వ్రాయించాడు **(1కొరింథీ 1:24)**.

యేసుక్రీస్తు ఎవరో, దేవుడెవరో ఎరగడమే అనగా యేసు దేవుని కుమారుడైన క్రీస్తు అనియు, అదే దైవ భక్తిని గూర్చిన అసలు మర్మము "నిరాక్షేపముగా దైవభక్తిని గూర్చిన మర్మము గొప్పదైయున్నది ఆయన సశరీరుడుగా ప్రత్యక్షమాయెను. ఆత్మ విషయమై దీనుడని తీర్పు పొందెను, దేవదూతలకు కనబడెను, రక్షకుడని జనములలో ప్రకటింపబడెను, లోకమందు నమ్మబడెను, ఆరోహనుడై తేజోమయుడయ్యెను" **(1తిమోతి 3:16; 1యోహాను 4:14–18)** అని ఎరిగి క్రీస్తుతో పాటు మనుషులందరికి తండ్రియైన దేవున్ని ఎలా ఆరాధించాలో, పూజించాలో తెలుసుకోవడమే జ్ఞానమైతే అదే మన భక్తికి అసలైన మూలం అని పరిశుద్ధగ్రంథము సెలవిచ్చింది **(యోహాను 4:22–24)**. ఆ జ్ఞానం లేకా భక్తి ప్రకారం మాత్రమే బ్రతుకాలనుకోవడమే దేవుడంటే భయపడటం అని ఆ దేవుని వాక్యం అబ్రహాము ద్వారా మనందరికి బుద్ధి చెప్పింది **(ఆది.కా. 22:1–12)**.

ఆ దేవుని ప్రియకుమారుడైన యేసుక్రీస్తు మనిషిగా మనలాంటి శరీరంలో బ్రతికిన కాలములో ఎలాంటి భయభక్తులతో జీవించి పరలోకం తిరిగి చేరుకొన్నాడో ఎరిగి "శరీరధారియై ఉన్న దినములలో మహారోదనముతోను, కన్నీళ్ళతోను తన్ను మరణము నుండి రక్షింప గోరు వానికి ప్రార్థనలు, యాచనలను సమర్పించి, భయభక్తులు కలిగియున్నందున ఆయన అంగీకరింపబడెను. ఆయన కుమారుడైయుండియు తాను పొందిన శ్రమలవలన విధేయత నేర్చుకొనెను. మరియు ఆయన సంపూర్ణ సిద్ధిపొందినవాడై మెల్కిసెదకు యొక్క క్రమములో చేరిన ప్రధాన యాజకుడని దేవుని చేత పిలువబడి తనకు విధేయులైన వారందరి నిత్య రక్షణకు కారకుడాయెను". **(హెబ్రీ 5:7–11)** అలాంటి విధానంలో బ్రతికి జీవితంలోని ఆఖరి క్షణం వరకు ప్రతి క్షణం ఆయనను వెంబడించి వినయ, విధేయతలు గలిగిన వారే నిజమైన భయభక్తులు గలవారని గ్రహించాలి.

నేడు క్రైస్తవులనబడిన వారు కూడా క్రమం తప్పకుండా గృహ కూడికలకు, కుటుంబ ప్రార్థనలకు, ఆదివారం ఆరాధనలకు, శనివారపు / శుక్రవారపు ఉపవాస ప్రార్థనలకు, ఉజ్జీవ, రక్షణ, సువార్త, స్వస్థత మహాసభలకు, ఆశీర్వాద పండుగలకు హాజరై దేవుని వాక్యం విని, ఆయన నీతిని ఎరిగినామని చెప్పినా తమ స్వనీతివలన **(రోమా 10:1–3)** వారిలో యదార్ధత లోపించు చున్నది. గనుకనే భక్తుల సంఖ్య పెరిగినా వారిలో భక్తి పెరుగటం లేదు. మరి దేవున్ని, ఆయన కుమారున్ని నమ్మని వారి పరిస్థితి తలిస్తే మరెంతగానో భయం వేస్తుంది **(1పేతురు 4:17–19)**. ప్రతి మనిషిలో స్వార్థం, అహంపెరిగి నీతి, న్యాయం తగ్గి దేవునికి దూరమై ఆయన కోపానికి గురైపోతున్నాము **(రోమా 1:18–32)**. మరీ ముఖ్యంగా మన చెడుతనాన్ని అస్సలు వదలడం లేదు. అందుకే నేటి మానవులందరి భక్తి ఉత్తుత్తిదిగానే మారిపోతుంది. వాపును చూసి బలుపు అనుకొంటున్నారు. తాను విన్నదే సత్యం, చెప్పిందే వేదం అనే భ్రమలో దయ్యాలు వేదాలు వల్లిస్తున్నాయి అనే సామెతకు సార్ధకతను తెస్తున్నారు నేడు గొప్ప భక్తులుగా చెలామణి అవుతున్నవారు.

ఈ లోకంలో ఉన్న అన్ని భాషల్లో 24 గం॥లు ఎన్నో మతాల భక్తిని గూర్చిన ప్రసంగాలు వినబడుతున్నా గాని మరియు రెండు వేల సం॥ల నుండి సువార్త అనగా దేవుని జ్ఞానం, సత్యం ప్రతిరోజు అనేక మార్గాల ద్వారా తమ చెవులకు వినబడుతున్నా కనీసం క్రైస్తవులైన వారి బ్రతుకులన్నా మారక ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే ఉంది. ఈ భక్తి అనే గొంగళి బాగున్నా బాగుండేది ఓసారి దులిపి మరోచోట వేసుకోవచ్చు, కాని దాని పరిస్థితి చిరిగిపోయి, చీకిపోయి, చెదలుపట్టి ఎందుకూ పనికి రాకుండా పోయింది. నేడు మనుషుల్లో దేవుడంటే భయభక్తులు కోలుకోలేనంత కోమాలోనికి వెళ్ళిపోయాయి. ప్రస్తుతం ఆ దేవుడు కూడా బాగు చేయలేని స్థితిలోనికి వెళ్ళిపోయామేమోనని ఆలోచిస్తే చాలా భయం వేస్తుంది. కేవలం మనుష్యులకు మాత్రమే భయపడుతూ, దేవుని యెడల మాత్రం భయం నటిస్తున్నారు **(మత్తయి 10:28–33)**. నిజంగా దేవునికి భయపడమంటే, ఎలాంటి ఆధారము లేకున్నా దేవుని మీద నమ్మకంతో మనకున్న సమస్తాన్ని ఆయనకు సమర్పించడమే. నిజమైన అనగా వాక్యానుసారమైన భయభక్తులంటే ఏమిటో ఆనాడు అబ్రాహాము రుజువు చేశాడు **(ఆది.కా. 22:1–12)**.

నేటి నవనాగరిక మానవజాతి అనాగరికులకన్నా అధ్వాన్నంగా తమ మానవత్వాన్ని మరచి, మృగాలకన్నా హీనంగా, అనగా దారుణమైన దానవత్వంలోకి వెళ్ళిపోయింది. క్రీస్తు పూర్వం జీవించిన ప్రజలలో అమానుషత్వం విలయ తాండవం చేస్తున్న రోజుల్లో పరమాత్ముడైన దేవుడు. ఐగుప్తు బానిసత్వంలో మగ్గుతున్న ఇశ్రాయేలీయులను మాత్రమే తన పిల్లలుగా ప్రత్యేకపరచుకొని వారికి మాత్రమే **(1తిమోతి 1:8–11)** ధర్మశాస్త్రాన్నిచ్చి కనీసం తాము కోల్పోయినటువంటి మానవత్వాన్ని తిరిగి సంపాదించుకోమని ఆజ్ఞాపించాడు. దాని కోసం వారికి సకల సౌకర్యాలను ఇచ్చాడు. ఎన్నో అద్భుతాలు, సూచక క్రియల ద్వారా వారిని ఆదుకొన్నాడు. భూమిమీద ఎవ్వరికి ఇవ్వనటువంటి పాలు తేనెలు ప్రవహించే దేశాన్ని స్వంతం చేశాడు.

వారు తమ స్వాతంత్రమును నిలుపకోలేకపోయినప్పుడు వారికిచ్చిన కాలము అయిపోగానే అనగా వారి అంత్య దినాలలోనే తన కుమారుడైన క్రీస్తు బలియాగం ద్వారా ఇశ్రాయేలీయులతో

పాటు సర్వలోకములోని ప్రజలను పిలిచి యేసురక్తంతో నూతన నిబంధన చేశాడు. దాదాపు 2000 సం॥ నుంచి మనుషులందరితో సిలువ వేయబడిన క్రీస్తు బోధ ద్వారా దివారాత్రులు తన యొద్దకు రమ్మని పిలుస్తూనే ఉన్నాడు **(మత్తయి 11:28–30; ఎఫెసి 1:3–12)**. నేటి మనిషి దానవత్వములో నుండి మానవత్వంలోనికి మరియు మానవత్వం నుండి దేవత్వంలోనికి మార్పు చెందాలన్నా, దేవుడంటే భయభక్తులు కలిగి జీవించాలన్నా దేవుని రాజ్యంలో ఉండాలన్నా **(మత్తయి 5:1–11)** దేవత్వాన్ని గూర్చి అనగా దేవుని గూర్చిన జ్ఞానం పూర్తిగా ఎరిగియుండాలి. దైవజ్ఞానంను గూర్చి క్రీ॥పూ॥ 1000 సం॥ల క్రితమే మహాజ్ఞానియైన సొలొమోను మహారాజు చాలా చక్కగా చెప్పాడు **(సామెతలు 2:5, 9:10, 14:26,27)**. దేవుడు సర్వమానవాళిని తన ఆత్మ స్వరూపంలో కన్నవాడు గనుక ఆయన అందరికి తండ్రి (ఆయనను నమ్మినా, నమ్మకపోయినా) కాబట్టి మన అందరితో తన ప్రేమ ద్వారానే భక్తికలిగి జీవించమన్నాడు **(1తిమోతి 2:1–15)**.

కాని ఈనాడు భక్తులుగా చెప్పుకుంటున్నవారు భక్తికన్నా భయాన్నే ఎక్కువగా కనబరుస్తున్నారు అనగా నటిస్తున్నారు తప్ప నిజంగా ఆలాగున బ్రతకడంలేదు. భక్తికి మూలం ఏమిటని దేవుని వాక్యాన్ని అడిగితే “యెరూషలేమునందు సుమెయోనను ఒక మనుష్యుడుండెను. అతడు నీతిమంతుడును, భక్తిపరుడునై యుండి, ఇశ్రాయేలు ఆదరణకొరకు కనిపెట్టువాడు” **(లూకా 2:25)**. ఇక్కడ భక్తికి అర్థం నీతిమంతుడై ఉండి పాపాత్ములైన ప్రజల రక్షణ కొరకు ప్రార్థనతో కనిపెట్టుకొని యుండాలి అన్నాడు. మరి నీతిమంతుడవడమెలాగని అడిగితే “అబ్రాహాము దేవున్ని నమ్మెను. అది అతనికి నీతిగా ఎంచబడెను” అతనికేగాక “యేసు దేవుని కుమారుడైన క్రీస్తు అని నమ్మిన వారందరిని నీతిమంతులుగా ఎంచుతానని” దేవుడు బైబిల్ ద్వారా అందరికి వాగ్దానం చేశాడు **(రోమా 4:17–25)**. మనం నమ్మేదానికి ఏ మాత్రం ఆధారము లేకపోయినా అనగా శరీరపరంగా కలుగబోయే మేలులు లేదా ఆశీర్వాదాలు రాకపోయినా, కష్టమొచ్చినా కూడా కేవలం పరలోకం కోసము దేవున్ని నమ్మడమే భయము – భక్తి అనియు, దానిని హెబేలు, హనోకు, నోవాహు, అబ్రాహాము, యోబు మోషె, దావీదు, దానియేలు ఇంకా ఎంతో మంది ప్రవక్తలు మనకు రుజువు చేశారు **(హెబ్రీ 11:1–40)**.

క్రీ॥శ॥ మొదటి శతాబ్దములో ఇటలీ పటాలములో శతాధిపతియైన కొర్నేలీ అను భక్తిపరుడొకడు కైసరయలో ఉండెను. అతడు తన ఇంటివారందరితో కూడా దేవునియందు భయభక్తులు గలవాడై యుండి ప్రజలకు బహుధర్మము చేయుచు దేవునికి ప్రార్థనలు చేయువాడు” **(అపొ.కా. 10:1–22)** అని దైవ గ్రంథములో వ్రాయించాడు దేవుడే. ఇక్కడ కూడా దేవుని నీతి, భయభక్తులు గూర్చి చెబుతూ, ఆపదలో ఉన్నవారిని ఆదుకొంటు, బీదలైన వారికి దాన, ధర్మాలు చేస్తూ అందరి మేలుకోసము ప్రార్థనలు చేయడము అని చెప్పాడు. అయితే ఈనాడు మనలో చాలామంది ఈలాంటివి చాలా చేస్తున్నా హృదయపూర్వకంగా, తమ స్వహస్తాలతో కష్టపడి సంపాదించిన సొమ్ముదానం చేయక, ఎవడో విదేశీయుడిచ్చినది మనమే ఇస్తున్నట్లు పేరుకోసమే ఇస్తున్నాము గనుక అది దేవుని దృష్టిలో భక్తిగా ఎంచబడక ఎన్నో భయంకర పరిస్థితులను చవిచూస్తున్నాము. ఎన్ని మంచి పనులు చేస్తున్నా చెడుతనం, లోకాశలను మాత్రం విడిచిపెట్టడం లేదు గనుక మనకు భక్తి లేనట్లేనని చెప్పవచ్చును **(యాకోబు 1:27)**. సర్వ మానవాళి రక్షణకోసం పాటుపడటమే నిజంగా భక్తి మరియు దేవుని వాక్కు లేకా జ్ఞానం ప్రకారం బ్రతకడమే భయం **(కీర్తన 34:9–17)**.

అబద్ధమాడకుండా ఉండి సత్యం చెప్పినప్పుడే సత్యవంతుడవని, పాపం చేయకుండా ఉండి పుణ్యం చేసినప్పుడు మాత్రమే పుణ్యాత్ముడవని, నీతిని జరిగించినప్పుడే నీతిమంతుడవని **(ఎఫెసి 4:25–37; సామెతలు 8:27; యోహాను 3:6,7)**. దేవుని మాటలు దివారాత్రులు మనకు వినిపించబడుచున్నవి. ఈనాడు మనుషులందరిలో భయ–భక్తులు లోపించడానికి అతిముఖ్యకారణం మనిషి దేహంలోంచి పుట్టుకొస్తున్న శరీరాశ–నేత్రాశ–జీవపుడంభములు **(1యోహాను 2:15–17)**. అందులో ముఖ్యమైనదే “ధనాపేక్ష”యని, ఈ ధనమే నేడు జరుగుతున్న సమస్త కీడులకు, అనర్థాలకు కారణమని దేవుడే చెబుతున్నాడు. ఈ లంచగొండి, దుర్వ్యాపారపు మరియు అన్యాయపు సిరిని దేవుడికి సమర్పించి, అదే భక్తి అనుకొని ఇంకా ఎక్కువ సంపాదించేటట్లు సహాయం చేయమని వేడుకొంటున్నారు. దేవునియందు భయభక్తులు కలిగి ఉండాలనే వారితో “దేవుని కుమారుడా, నీవైతే వీటిని విసర్జించి, నీతిని, భక్తిని, విశ్వాసమును, ప్రేమను, ఓర్పును, సాత్వీకమును సంపాదించుకొనుటకు ప్రయాసపడుము” **(1తిమోతి 6:3–14)** అని ఖచ్చితముగా హెచ్చరించి చెప్పుచున్నాడు.

ఈ మాటలు చదివిన వారంతా తమ భయ–భక్తులు ఎంత వరకు సిలువ వేయబడిన క్రీస్తు బోధ ప్రకారం ఉన్నవో తమ్మును తామే పరీక్షించుకోవాలని, చర్చి లేదా గుడికి రావడమే, దశమభాగాలు, మొక్కుబడి కానుకలు ఇవ్వడమే, మరియు శరీరాన్ని వణికించడము, మోకరించడము, ఉపవాసాలుండటం, సిలువముందు సాష్టాంగపడటమే భయము – భక్తికాదని, సకల దుర్గుణాలలకు పుట్టినిల్లు అయిన మన శరీరకోర్కెలను వంచడమే మరియు చంపడమే **(గలతీ 5:16–24)** భయభక్తులని గ్రహించగలిగితే ధన్యులము **(యాకోబు 2:19–26, 1:21–27)**. ఇంట్లో, చర్చీలలో, బయట, మరియమ్మ, బాలయేసు, సిలువ, పావురము, పరిశుద్ధాత్మ మరియు దేవుని బొమ్మలకు విగ్రహాలకు మొక్కడం, కొబ్బరికాయలుకొట్టి, కొవ్వొత్తి వెలిగించడం భక్తి ఏ మాత్రము గాక, భయంకరమైన విగ్రహారాధన అని గ్రహించండి. మనందరికి దేవుడిచ్చిన ఈ అద్భుతమైన అవకాశంతో మన ఒంటిని, ఇంటిని, ఊరు–వాడలను, దేశాన్నే ఓ దేవాలయంగా